

# రంగుటద్దాలు

"రవణ"

క్రిందికి దిగిపోతూ మేడమీది కిటికీదగ్గర ఆగాడు. బాబ్జీ కాళ్ళెత్తి బొటనవేళ్ళమీదనుంచుని కిటికీ తలుపుకున్న నీలిరంగుఅద్దానికి ముక్కానోరూ ఆనించి బయటికిచూశాడు.

బయటఅంతా రాత్రిఅయిపోయింది. కానీ మామూలురాత్రిలా లేదు! భయంకూడా వెయ్యటంలేదు. అసలురాత్రికన్నా ఇలాంటిరాత్రి ఏంతో బావుంది. మొన్న తాతయ్య కిష్టుడికథ చెప్పాడు. తనకు నిద్రలో కిష్టుడికలొచ్చింది. కిష్టుడూవాళ్లూ ఆడుకున్న రాత్రిలాగేవుంది. ఇలాంటి రాత్రిలోలాగా మామూలు రాత్రిలో అన్నీబాగా కనపడవు కూడాను.

కాళ్లు కిందకి దింపి ఈ మాటు ఎర్రద్దంలోంచి చూశాడు. ఈ మాటన్నీ ఎర్రగాఅయిపోయాయి నిప్పులాగ. 'చిట్టికిచూపించాలి ఈ మాజిక్కు' అనుకున్నాడు బాబ్జీ.

ఏదోజ్ఞాపకంవచ్చింది. మంచంక్రింద ట్రంకుపెట్టిబయటికిలాగాడు. దాంట్లో32ఇనుప మేకులూ 10 స్క్రూమేకులూ, 6 గాజుగోళీలు, ఒకపిండిగోళీ, ఒక గుర్రపునాడా, థర్మామీటరుగొట్టం, ఒకముల్లులేని బొంగరం, ఒకపాళీకున్న చెమ్చా, సుద్దముక్కలూ, అవీవున్నాయి. బాబ్జీ గబగబావెతికాడు దేనికో ...... అబ్బ! వెధవది! అస్తమానం అక్కర్లేనివే అడ్డొస్తాయి!... ఓమాటు ఆగికోపంగా చూశాడు వాటికేసి. మళ్లామెల్లిగా వెతికాడు. అమ్మయ్య! దొరికింది... ఆకుపచ్చ గాజుపెంకుపట్టుకుని, కిటికీదగ్గరకొచ్చి తలుపుదీసేసి దాంట్లోంచి చూశాడు. ఎలాగేనా ఇదినీలికన్నా బెస్టు. దీంతో రాజకుమారుడు మంచి గుర్రమెక్కి రాక్షసుడితో యుద్ధంచేసి రాజకుమార్తెను రక్షించాడులావుంది, ఆకుపచ్చ గాజుపెంకులోంచి చాలాసేపు చూశాడు బాబ్జీ ఏదో ఆలోచిస్తూ.

మెట్లదగ్గిరికివచ్చి బాగావంగి వంటింటివేపు చూశాడు. అమ్మపనిలోవుంది. నాన్నా చిట్టీ బజారుకెళ్లుంటారు. తను చద్దెన్నం తినేశాడు. ఇప్పుడు గాని అమ్మ చూసిందా, వంటింట్లోకూచుని పదమూడోఎక్కం వెయ్యమంటుంది. ఇటుతనకా బోలెడుపనుందాయె!... బాబ్జీకినిజంగా అమ్మమీద కొంచెం చిరాకేసింది. "ఈ ఆడవాళ్ళకేం తెలుసు మగాళ్ళపనితొందర? ఊరికే పదమూడోఎక్కం వెయ్యమంటారుగాని?" అన్నాడు ఎదురుగుండా పెద్దమనిషితో. అక్కడున్నస్థలం అమాంతంగా ఓ పెద్దమనిషయిపోయి "చిత్రం, చిత్రం" అని యికిలించి మళ్లాస్థలం అయిపోయింది.

"వీరుడా జాగ్రత్త" అనుకుని చప్పుడుచెయ్యకుండా మెట్లుదిగి చల్లగా పెరట్లోకి జారుకున్నాడు. తిన్నగావెళ్లి గడ్డిమేటి వెనకాల్నుంచి రెండుకర్రలు తీశాడు. సన్నగా, పొడుగ్గా చివరకొంచెం సూదిగావున్నదొకటి — కొంచెం లావుగా పొట్టిగావున్నదొక్కటి. అందులో మొదటిదికత్తి, రెండోది కాళీకాదండం.

"ఓ రాజకుమారా! నీకు జయమగును" అని కాళీకాదండం నెత్తిమీదపెట్టుకుని ఆశీర్వదించుకున్నాడు. రోజూ అలా చిట్టివుండేది కాళిగా. ఇవాళతనే.

కత్తి— అంటే పెద్దకర్ర — మొల్లోపెట్టుకున్నాడు. దండం మామూలుకర్రయిపోయింది. దాన్నికూడా మొల్లోపెట్టుకున్నాడు. బయల్దేరాడు మహాఅరణ్యాల్లోకి. రాజకుమారుడు దట్టంగాను, చీకటిగానువున్న కారడవిలో కొన్నేపటికి (పెరట్లో మల్లిపందిరి-) వాళ్ళపిల్లిఎదురొచ్చి కొంచెం వెనకితగ్గి వీపుపైకెత్తి మ్యావ్ అంది

అంటూనే పెద్దపులి అయిపోయింది- రాజకుమారు తెకి ఓ తెక్కా! "హుఁ! భావు" అంటూ, మొల్లోంచి కత్తితీసి విసురుగా మొన దాని ముఖంవైపు పోనిచ్చాడు, పులి బెదిరింపుగా గాండ్రించింది. తను హుమ్మంటూ ఇంకో అడుగు ముందుకేశాడు...అంతే-పులి దూరంగా పారిపోయి, పిల్లి అయిపోయి పెరటిగోడ దూకేసింది చిన్నగా నవ్వి తలపంకించి బయలుదేరాడు బాబ్జీ.

చేమంతిచెట్టు వెనక్కి వెళ్ళాడు. అట్టే కష్టం లేకుండానే అక్కడ రహస్యగుహ కనుక్కున్నాడు. ఆ గుహ ఇతరులకి కనపడదుగా. అందుకని వుత్తుత్తి గుహ చాలు. కాళికి నమస్కారం పెట్టి ఆమె ఇచ్చిన విచిత్ర అద్దం తీశాడు—అది ఇందాకటి ఆకుపచ్చ గాజు పెంకు—దాంట్లోంచి, చూశాడు జాగ్రత్తగా... రెండువందలసంవత్సరాల క్రింద పాతిపెట్టబడిన ధనం గని కనపడింది బాబ్జీకి. చేతిలో కత్తి ఇప్పుడు గునపంగా మారిపోయింది. దాంతో చాలాసేపు పట్టుదలగా తవ్వేడు...ఆ!... అడుగునేదో గట్టిగా తగిలింది...ఇంకేం! మొహరీలూ! కాసులూ!

అవి మీరు చూస్తే చిల్లపెంకులూ సోడా కాయ్కలూ అంటారు. కాని అవి నిజంగా మొహరీలూ కాసులే.

బాబ్జీ ఆలోచించాడు. ఇప్పుడింత ధనాన్ని తీసుకెళ్తే ప్రజలు చూసి ఎక్కడిదంటారు. అంచేత తర్వాత తీసుకెళ్తే మంచిది. తిరిగి అన్నిటినీ కప్పేశాడు. చేమంతిచెట్లనుంచి తిన్నగా నూతిదగ్గరకొచ్చి బట్టలుతికే బండమీద కూచున్నాడు.

చేతులు రెండూ ముందుకు చాపి వాటిమీద అడ్డంగా రెండుకర్రలూ పెట్టాడు. అంతే కత్తీ దండం ఇప్పుడు విమానం రెక్కలయిపోయాయి.

బుర్...ర్, ర్...బు...

కెప్టెన్ బాబ్జీ విమానంలో డ్రైవర్ పక్కన కూర్చుని శత్రువులమీద బాంబులు వేయిస్తున్నాడు. తక్కినవాళ్ళంతా కెప్టెన్ బాబ్జీకి లొంగి పనిచేస్తున్నారు. ధన్...ధన్...

పాపం కెప్టెన్ బాబ్జీ విమానం కాలిపోతోంది. తక్కినవాళ్ళంతా చచ్చిపోయారు. కెప్టెన్ బాబ్జీ వెంటనే గాలిగొడుగుతో కిందకి దిగిపోయి ప్రాణం రక్షించుకున్నాడు. అంతే బండమీంచి కిందకి దూకి ఇంట్లోకెళ్ళే సన్నటి దారిదగ్గర ఆగాడు.

అది సరిగ్గా క్రికెట్ పిచ్‌లావుంది, లాగేమిటి?...అది క్రికెట్ గ్రౌండే! ఇండియాకీ దొరలకీ మాచి. బాబ్జీది ఆఖరు బాటింగు. ఇండియాకి ఇంక 1. రన్నులు వస్తే గెల్చేస్తుంది. జనంఅంతా ఆతృతగా, ఆశగా చూస్తున్నారు బాబ్జీకేసి. మొదటిబాలు వైడ్. బాబ్జీవదిలేశాడు. రెండోబాలు చాలా రూడ్‌గావస్తోంది. బాబ్జీ దానికి బ్యాటుఅడ్డంపెట్టి చిన్నకట్ కొట్టాడు. బౌండ్రీ!

జనం చప్పట్లుకొట్టడం ఇంకా పూర్తికానే లేదు? బంతిఆకాశమంత ఎత్తునించిపోయిగ్రౌండు దాటి అవతలపడింది. సిక్సర్! ఇంక రెండే రన్నులుకావాలి?...... నాలుగోబాలు తుపాకి గుండులా వచ్చేస్తోంది? బ్యాటుతో చిన్నటచ్... అంతే (బౌండ్రీ)

ఒక్కమాటుగా ప్రజలంతా గ్రౌండులోకి వూగిపోయారు. "ఇండియాకి జై! బాబ్జీకి జై!" అంటూ బాబ్జీని పైకెత్తి పెవిలియన్ కిందకి తీసుకెళ్ళారు. అక్కడ మెడ్రాస్ గవర్నరూవాళ్ళూ షేక్‌హాండిచ్చి బోలెడుకప్పులూ, మెడల్సూ, పదిరూపాయలూ ఇచ్చారు.

బాబ్జీ తన మంత్రదండంతో పుష్‌అని దబ్బూ, ప్రయిజులు అన్నీ మాయంచేసేశాడు. చిటికెలో బాబ్జీ వాళ్లింటివసారా షెడ్డులో వున్నాడు. (అదే ఇందాకటి పెవిలియన్) బయటికి ఏలా వచ్చాడో అలాగే మెల్లగా మేడెక్కిపోయాడు. బాబ్జీ.

పడక కుర్చీలో చిట్టి నిద్రపోతూంది. మెల్లగా కుర్చీదగ్గరకు వెళ్ళాడు బాబ్జీ. చిట్టి నుదుటిమీద మెల్లిగా తట్టాడు. "రాజకుమారీ నిద్రలే!" అన్నాడు.

చిట్టిమెల్లగా కళ్ళుతెరిచి బద్ధకంగా ఆవులించి మొహంమీదపడ్డ జుట్టు సర్దుకుని లేచికూర్చుంది.

'రాజకుమారీ! నువ్వు చాలాకాలంనుంచి నిద్ర

పోతున్నావు. నీశాపం పోయింది. నే. నీనరాక్షసుణ్ణి చంపేశాను' అన్నాడు రాజకుమారుడు.

కళ్లు పెద్దవిచేసి వింతగా చూస్తూ, తన చిన్న తెల్ల నోరు ముందుకిపెట్టి, అతిరహస్యంగా అంది చిట్టి 'ఒరేయ్ అన్నాయి! మరేం నీకేం, నిఝం రాక్షసుణ్ణి చూపించనా?' అని.

" నిజంగానే? .. నేనెప్పుడూ నిజం రాక్షసుణ్ణి చూళ్లేదే... చిట్టీ! ఏదీ?" అన్నాడు రాకుమారుడు,

ఎర్రటి మెత్తని చూపుడువేలిని గులాబి పెదిమల దగ్గరచేర్చి 'ష్? రా' అంటూ చిట్టి దారితీసింది. రాజకుమారుడు వెనకాలే వెళ్ళాడు కత్తి పట్టుకుని. మేడమెట్లమీద కూర్చుని, వొంగి వాళ్ళ నాన్న గదికేసి చూపించింది చిట్టి. బాబ్జీకూడా వొంగి చూశాడు. నిజంగా రాక్షసుడేవాడు... కాని మీసాలు, గడ్డాలు అంటించుకుని వాళ్ళ మావయ్య వేషం వేసుకొచ్చాడు. కాని తమలా మంత్రాలు తెలిసిన వాళ్ళకి నిజం తెలుసు.

చిట్టి బాబ్జీ ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు, ఒక్కమాటుగా కిలారుమని నవ్వుకుంటూ మెట్ల పక్కనేవుండే కర్రదూలంఎక్కి జర్రునజారి పెరట్లోకి పారిపోయారు.

కాస్సేపుండి బాబ్జీ ఇంట్లోకొచ్చాడు. అమ్మ ఎదురయింది.

'ఎక్కడికెళ్ళావురా? పొద్దున్నే?'

'పెరట్లో తిరుగుతున్నానే' అన్నాడు పరధ్యానంగా.

"అయితే చదువు సంధ్యా లేకుండా ఏంచేస్తున్నావురా"

బాబ్జీకి చిరాకేసింది. ఈ అమ్మతన్ని వదిలేట్టులేదు. "మొగాళ్లకి తెల్లవారిలేస్తే లొంభై పనులుంటాయి. అవన్నీ ఈఆమ్మలికి చెప్పాలండీ" అన్నాడు ఎదురుగావున్న పెద్దమనిషితో. మేడ మెట్లసుంభం పెద్దమనిషిగా మారిపోయి "చిత్రచిత్రం" అని ఇకిలించి మళ్లా స్తంభం అయిపోయింది.

'నిన్నేరా! మాట్లాడవేం మొద్దూ!' గదమాయించిందమ్మ.

'అబ్బ! చెప్పాగదే పెరట్లోతిరుగుతున్నానని' అన్నాడు మేడమెట్లెక్కుతూ. అమ్మకొంచెం ఆందోళనతో తలూపి వెళ్ళిపోయింది. పైకెళ్లి మళ్లా గంగుటద్దాల కిటికీదగ్గర ఆగాడుబాబ్జీ. దూరంగా కిందనించి అమ్మమాటలు వినబడుతున్నాయి.

"ఏమండీ! బాబిగాడిసంగతి చూస్తున్నారా? వాణ్ణిబడిలోకి పంపాలండీ! మీరుచదువూ కథలూ ఎంతచెప్పినా అర్థానికిలోడు లేకొ-మోను—వతి మందకొడి వెధవౌతున్నాడు. ఎప్పుడూ పరధ్యాన్నమే, అదేం మాలోకమ్మో?!'

బాబ్జీ సగంసగంవింటున్నాడూపరధ్యానంగా.

కిటికీఎక్కి పైనున్న ఊదారంగు అద్దంలోంచి చూశాడు. వాడికి లోకమంతా ఓలేత గులాబీ పువ్వులా కనపడింది,

—: అలవాటు :—



"సినీ ప్రేక్షకసంఘ అధ్యక్ష హోదాతో చెప్తున్నా! వినండి! హాలు కెపాసిటీకి పదిరెట్లు జనంతో ఘోరాతిఘోరంగా ఉంది, ఇకనైనా బుక్కింగ్ నిలిపించండి... లేదా...."

"ఛాల్లే! నేటికి చెప్పొచ్చావ్! ఈ హాలు కట్టించకముందు నా బస్సు సర్వీసులో వందకు పైగా ఓవర్‌లోడ్ కేసుల్లో తప్పించుకొని జయించుకొచ్చిన నాకిదేం భయపడాల్సింది కాదు-అలవాటే"